# కుమారి అల్లమరాజు సంధ్యాబాల

# మనసు గతి ఇంతే..



బయట వర్షం బాగా కురుస్తోంది. కురిసే వాన లోంచి మెరుపులా దూసుకుపోతోంది ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్. కిటికీదగ్గర సీటులో పాలరాతిబొమ్మలా ఒదిగి కూర్చుంది ప్రేమ. ముదురాకుపచ్చరంగు వెంకటగిరి సాదాసేత చీరలోంచి ఆమె పచ్చని శరీరచ్ఛాయ లైట్ల కాంతిలో వింతగా మెరుస్తోంది.

కిటికీకి జారబడి, అద్దాల్లోంచి వర్షంలో తడిసిన ప్రకృతిని చూస్తోంది ఆమె. ఇళ్ళూ, పొలాలూ, చెట్లూ, చేమలూ అన్నీ చూస్తుండగానే కనుమరుగై పోతున్నాయ్. వర్షం చేసే చప్పుడూ, ఆకాశంలో అప్పుడప్పుడూ మెరుపులూ, మధ్యలో ఈదురు గాలి చేసే రొదా...వింతైన అనుభూతిని కలిగిస్తున్నాయి.

ఏదో స్టేషన్లో ట్రెయిన్ ఆగి, మళ్ళీ వేగం పుంజుకుంది. పెట్టెలో కొద్దిగా కోలాహలం మొదలయ్యింది. ఎక్కినవాళ్ళు సామాన్లన్నీ సరిగ్గా వచ్చాయోలేదో చూసుకుంటున్నారు. తినుబండారాలమ్మేవాళ్ళు హడావిడిగా అటూయిటూ తిరుగుతున్నారు. ప్రేమ తన చేతి సంచిలోనుంచి బత్తాయి పండు ఒకటి పైకి తీసింది. ఏదో ఆలోచిస్తూ పండు వొలుస్తూన్న ఆమెదృష్టి యధాలాపంగా ఎదుటి సీటుమీద పడింది.

అక్కడొక మధ్యవయస్కుడైన పురుషుడు తాపీగా పేపరు చదువుకుంటున్నాడు. బ్రౌన్‌కలర్ సూట్‌లోంచి బంగారుగొలుసొకటి శరీరచ్ఛాయతో పోటీపడుతూ అతని మెడమీద మెరుస్తోంది. ముంజేతికి వేళ్ళాడుతున్న సన్నని గోల్డుచెయిన్‌ని విలాసంగా వెనక్కి తోసుకుంటూ అతను పేజీలు దిశగా తిరగేస్తున్నాడు.

ప్రేమ బత్తాయిపండు తినడం పూర్తిచేసి బాటిల్ ఎత్తి మంచినీళ్ళు తాగింది. పేపర్లోంచి అతడు ముఖం బైటకితీసి కిటికీలోంచి అవతలకి చూడటం ప్రారంభించాడు.

ప్రేమకి ఒక్కక్షణం ప్రపంచమంతా స్తంభించినట్లైంది. కళ్ళార్పడం మర్చిపోయి అతనికేసే చూడసాగింది. ఎంత అందమైన విగ్రహం...

జ్ఞాపకాల తెరల్లోంచి, గతం తాలూకు స్మృతుల్లోంచి, అతని రూపం గుర్తుతెచ్చుకోడానికెంతో సేపు పట్టలేదు. "సుధాకర్...సుధాకరే...కదూ తను!" మనసులో పదేపదే అనుకుంది. ఎన్ని యుగాల తర్వాత చూసినాసరే అతన్ని గుర్తుపట్టగలదు తను. ఎన్ని సంవత్సరాల తర్వాత తటస్థపడ్డాడతను! కానీ విచిత్రం— ఆనాటికీ ఈనాటికీ అతనిలో గుర్తించదగినంత మార్పేమీ రాలేదు.

వయస్సు తెచ్చిన పెద్దతరహా, దాని తాలూకు కొద్ది ఒళ్లూ తప్ప.

'కానీ...తను'... ఆమె పెదవులమీద దరహాస రేఖ మెరిసింది. పూర్తిగా తన సౌందర్యం మాసి పోకపోవచ్చు. కానీ కాలంతనలో ఎన్నిమార్పుల్ని తెచ్చింది! బాధ్యతలవల్ల జుట్టుబాగా నెఱిసింది. బాధలు కళ్ళకింద చారల్ని తెచ్చాయి.

ప్రేమ మనసు గతంవైపుకి పరుగులు తీసింది. "తన జీవితం ఎన్నిమలుపులు తిరిగింది? ఇరవ య్యేళ్ళక్రితం తన మనస్సుకి స్పందన లేకపోతే తన జీవితం మరోవైపుకి మళ్ళిఉండేది" రైలు వేగం పుంజుకుంది. ఆమె మనసు పగ్గాలు తెంచు కుని పరిగెట్టసాగింది.

* * *



"నాన్న బొజ్జవెనకాల దాక్కుని, బుద్ధిగా నోట్లోవేలేసుక్కూర్చునే బుజ్జిబాబా? నవలలు చదివి ప్రభావితమైపోయి కట్నంలేకుండానే పెళ్ళి చేసుకుంటాననీ, కానుకల్తోనే సరిపెట్టుకుంటాననీ, ఎలుగెత్తిచాటే ఆంధ్రవీరుడా? ఎవరే ఈ త్రిప్పు పెళ్ళికొడుకూ?" కాలేజీకి శెలవుపెట్టి సొంత ఊరికెళ్ళి, ఆవేళే ఇంటినుంచి తిరిగొచ్చిన ప్రేమ చుట్టూ చేరి ప్రశ్నలవర్షం కురిపించారు స్నేహితు రాళ్ళందరూ.

ప్రేమ సిగ్గుపడుతూ చెప్పింది. తనని వరించి వచ్చిన మానవవీరుడు అందమైనవాడూ, లక్షల ఆస్తి ఉన్నవాడనీ, తనని నాలుగైదుసార్లు అతడు అక్కడక్కడా చూడడం తటస్థించి కోరి పట్టు బట్టితే ఈ పెళ్ళి నిర్ణయం అయిందనీ, లేకపోతే జీవితంలో అంతమంచి సంబంధం కట్నంలేకుండా రావడం... వారి ఊహల్లోకేరానివిషయమనీ, పెళ్ళి ముహూర్తానికింక నెలాపదిహేనురోజులు వ్యవధి ఉందని, అందర్నీ తప్పకరమ్మని ఆహ్వానించింది.

"ఓహ్! ఓహ్! ఓహ్!" లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, చుట్టూతిరిగి గంతులేశారు స్నేహితులు. "ఏం సినిమాటిక్‌గా మారిపోయిందే నీ స్టోరీ? అవునూ! ఎందుకైనామంచిది, పెళ్ళిఖర్చులకైనా ఉంటుంది ఓ నవలగారాసి పారేద్దూ! అనక మీ ఆయన ఏ సినిమాకిందైనా తీసిపారేస్తాడూ..." మళ్ళీ నవ్వులవర్షం.

ఆ పట్నంలో అదోనాలుగిళ్ళలోగిలి. అందులో మూడునాలుగు కాపురాలు. ఓవాటాలో ప్రేమా, ఆమె క్లాస్‌మేట్సూ కల్సి అద్దెకుండి చదువుకుంటు న్నారు. ఒకవాటాలో ఇద్దరు వృద్ధదంపతులు, ఇంకోవాటాలో ఓమధ్యతరగతి గుమాస్తా సంసారం, మరోవాటాలో ఉద్యోగస్తుడైన ఒక అవివా హితుడూ ఉంటున్నారు. ఆ ఉద్యోగస్తుడి పేరు సత్యం. [illegible] బుద్ధి మంతుడు. ఈకాలంలో పుట్టవల్సినవాడుకాదు అతనికి ఆం[illegible] సాహిత్యమంటే పిచ్చి ఉండేది. ప్రేమా ఆమె స్నేహితురాళ్ళూ అతనిచేత ఇంగ్లీషుపాఠాలు చెప్పించుకునేవారు. సౌమ్యంగా వంచిన తల ఎత్త కుండా, ఎంతో బాగా పాఠాలు చెప్పే అతడిని ప్రేమ స్నేహితులు "దేవుడు మాష్టారు" అని పిలుస్తూండేవారు.

* * *

"నన్ను క్షమించండి సత్యం!" సిగ్గుతో చితికి పోయింది ప్రేమ. "అనుకోకుండా మీ గదిలోకి పెట్టిన నేను మీరు నిండు ప్రాణం తీసుకోవడం చూసి బిగుసుకుపోయి, ఏం చేయాలో తెలియని స్థితిలో, ఆ కంగారులో మీ మీద చేయి చేసు కున్నాను. అంతేగానీ మీ వెనకాల ఇంత కథదాగి ఉందనుకోలేదు." అతను చెప్పినదంతా విని కుర్చీలో కూలబడిపోయి బరువుగా నిట్టూర్చింది ప్రేమ.

సాహిత్యంలో తలపండిన ప్రొఫెసర్‌లా హుందాగా, గౌరవభావం కలిగేలా, పాఠాలు బోధించే సత్యం ఆ క్షణంలో గాలివానలో దారి తప్పిన ఒంటరి పక్షిలా, దిక్కులేని పసివాడిలా మోకాళ్ళమీద కూలబడిపోయి, ఏ ప్రత్యేక పరి చయమూలేని ప్రేమ చేతుల్లో తలదాచుకుని బావురుమన్నాడు.

"ఒక్క నిముషంలో ఎంతటి ప్రమాదం తప్పింది! ఈ చిన్న జీవితం మనది. దీనిని బాగు చేసే బాధ్యత ఇతరులకు లేకపోవచ్చు. కానీ పాడు చేసుకునే హక్కు మాత్రం మనకి లేదు. మీలో ఇంతటిమూర్ఖత్వం, అమాయకత్వం ఉన్న విషయం నాకు తెలియదు" ప్రేమ నెమ్మదిగా అంది.

సత్యం వేదనకు కారణముంది. అతను ఓ డబ్బున్న అమ్మాయిని ప్రేమించి మోసపోయాడు. ఆ అమ్మాయి తన జీవితంలోని రంగు రంగుల విలాసాల్లో ఓ బాయ్‌ఫ్రెండుకి కూడా యిచ్చి చూసిన "ఛాయిస్"ని, సత్యం శాశ్వతంగా నిలిచే "నిష్కల్మషమైన ప్రేమ" కిచ్చిన విలువగా భ్రమించి దగాపడ్డాడు. కథ అక్కడితో ముగిసి పోతే బాగుండు కానీ ముగిసిపోలేదు. సత్యానికి ఆ అమ్మాయి కానుకగా ఇచ్చిన ఒక 'చిన్నకూతురు' ఓ అనాథ శరణాలయంలో ఉంది. సత్యానికి హాండిచ్చేసిన ఆ అమ్మాయి త్వరలో 'పెళ్ళి కూతురు' కాబోతోంది. అందమైన కార్లూ, అనేక కంపెనీల్లో షేర్లూ ఉన్న గొప్పింటి పడుచుని చేసుకోబోయే ఆ అమ్మాయి సత్యాన్నీ, సత్యం తాలూకు కొన్ని జీవిత సత్యాల్నీ, డబ్బుతో కడి గేసుకుని రెక్కలొచ్చిన పిట్టలా ఎగిరిపోయింది.

జీవితంలో ఆ అమ్మాయి తీసిన ఎదురుదెబ్బకు సత్యం కదిలిపోలేదు. కానీ, అమ్మ ఉండీ, ఓపాపను అనాథను చేసి పోయిన ద్రోహానికి దిగులుతో కుళ్ళిపోయాడు.

పెళ్ళికాని తండ్రిగా సంఘంలో నిలబడ్డానికైనా బెదిరిపోలేదు. కానీ, పెళ్లాం వదిలేసిన భర్తగా ఆ పాపకు ఎలాతండ్రికావాలో, దాని పరిణామాలు ఆ పసిజీవితంమీద భవిష్యత్తులో ఎలా ప్రతి ఫలిస్తాయో ఊహించుకుని బెదిరిపోయాడు. ఆలో చించి ఏంచేయాలో తోచక అందుబాటులోఉన్న, ఆత్మహత్యా ప్రయత్నంచేశాడు సత్యం.

సానుభూతితో హృదయం ద్రవించిపోయింది ప్రేమకి.

* * *

గుమ్మంలోనే ఎదురొచ్చింది రష్య. "ఓహ్హో ప్రేమ అంటే మీరేనన్నమాట. మీరు సత్యం జీవి తాన్ని సానుభూతితో సరిదిద్దమని కోరుతూ రాసిన సుదీర్ఘమయిన లేఖ అందింది. మీరాశించినట్టు రెస్పాన్స్ రాకపోయేసరికి సరాసరివెతుక్కుంటూ మాయింటికే వచ్చేశారే, గుడ్! మనదేశంలో ఇంకా మంచిమంచి సెంటిమెంట్లున్న ఆడవాళ్లున్నంత వరకూ మగవాళ్ళకేం ఫర్వాలేదు. పోన్లెండి! సత్యాన్ని రిప్రజెంట్ చెయ్యడానికివచ్చి, సత్యం తరఫున నామేరేజీఫంక్షన్‌కి రిప్రజెంట్‌చేసి వెళ్తు న్నారు. ఎనీహౌ థాంక్యూ, థాంక్యూవెరీమచ్! మావారిప్పుడే ఫ్రెండ్సుని పిలిచిరావడానికి కార్లో బయటికెళ్ళారు. లేకపోతే మిమ్మల్ని ఆయనకు

తప్పక పరిచయం చేసిఉండును 'మిస్ ప్రేమ, మై బాయ్‌ఫ్రండ్స్ గర్ల్‌ఫ్రండ్ అని.'

ఆయింటి ఆవరణదాటి బయటికి అడుగుపెట్టిన ప్రేమకి రమ్యంటే మనసునిండా అసహ్యం పేరుకుంది. ఛీఛీ! మనుషుల్లో ఎంతటినైచ్యముంటుంది! చూసి చూసి శత్రువులకికూడా హాని తలపెట్టలేం. అలాంటిది, పచ్చనిజీవితాల్ని చేజేతులా పెకలించి పారేయడానికి గుండెల్లో ఎంతటి క్రౌర్యముండి ఉండాలి?

"పాపం... సత్యం..." ఆమె గుండెల్లో కొండంత జాలి పేరుకుంది.

* * *

"పూజ్యులయిన నాన్నకు నమస్కరించి,

ప్రేమ వ్రాయునది. నేను జీవితంలో నీకిలాంటి ఉత్తరం వ్రాయవల్సివస్తుందని కలలోకూడా ఊహించలేదు. నేను సత్యంఅనే ఓ అబ్బాయిని ప్రేమించాను. మాయిద్దరికీ ఓపాపకూడా ఉంది. అమ్మా నాన్నా అన్నీ నువ్వేఅయి పెంచినందుకు, ఐదేళ్ళపాటు నామీదనమ్మకముంచి పట్నంలో పెట్టి చదివించినందుకు, నీకు నమ్మకద్రోహమే చేశాను. నన్ను క్షమించమని అడగడం అత్యాశే అవుతుందేమో ... !

సుధాకర్‌తో సంబంధం నిశ్చయించడానికి సిద్ధపడినప్పుడే ఈ విషయం ఎందుకుచెప్పలేక పోయావని నువ్వునన్ను ప్రశ్నించవచ్చు. కానీ అందమూ, ఐశ్వర్యమూ ఉన్న సుధాకర్‌వంటి ఉత్తముడు నన్ను కోరి పెళ్ళాడుతానని వస్తే-ఓ అనామకుణ్ణీ, సామాన్య యువకుణ్ణీ నేను పెళ్ళాడతానని పట్టుబట్టి కూర్చుంటే, సిరిరా మోకాలడ్డే దౌర్భాగ్యురాలిగా తలచి, నా జీవితం బాగుచేయాలనే మంచి ఉద్దేశ్యంతో నువ్వునన్ను అడ్డుకుంటావేమోనని భయపడి నీకు నిజం చెప్పలేకపోయాను. నిన్నటిదాకా నా అదృష్టాన్ని తలుచుకుని మురిసిపోయిన నువ్వు, ఈఉత్తరం చదువుకుని కుమిలిపోతావని, నన్నసహ్యించుకుంటావనీ తెలుసు. సుధాకర్‌తో రెండు మూడు రోజుల్లో కొన్నేసిన నా పెళ్ళి ఆగిపోయి, నువ్వు ఎంతో విలువిచ్చే పరువు ప్రతిష్ఠలు

## చెప్పలేదేం?

కనకారావుకి అన్నం వడ్డిస్తూంది కాంతం.

"మీకు బీరకాయకూర అంత ఇష్టమని నాకెప్పుడూ చెప్పలేదే!" అని అడిగింది.

"దాని మీద వున్న ఇష్టం పోగొట్టుకోవడం ఇష్టం లేక" అన్నాడు కనకారావు.

టి. శ్రీనివాస్ కుమార్
ఏలూరు

మంటగల్సిపోయాక, యిక జీవితంలో నాముఖం చూడవని నాకు తెలుసు.

అయినా సత్యాన్ని పెళ్ళిచేసుకుని, అతనితో దూరంగా వెళ్ళిపోబోయేముందు, నీనుంచి వీడ్కోలు తీసుకోకుండా వెళ్ళడానికి అంతరాత్మ అంగీకరించడంలేదు. అందుకే ఆఖరిసారిగా ఈ ఉత్తరం రాస్తున్నాను.

నేను పితృద్రోహినే కావచ్చు.
నన్ను క్షమించు,
—ప్రేమ"

రాసిన ఉత్తరం మడిచి సత్యానికితెచ్చి చూపింది ప్రేమ. ఉత్తరం చదవడం ముగించిన సత్యం కళ్ళెత్తి, నీటితెరల మధ్య ప్రేమకేసి చూశాడు. ఆ చూపు మామూలు చూపులాగాలేదు. ఏ ప్రయత్నమూ చెయ్యకుండానే భగవంతుడు ప్రత్యక్షమయితే-ఆ దైవస్వరూపాన్ని చూసి మైమరచిపోయే భక్తుని కళ్ళల్లోని పరవశత్వం ఆచూపుల్లో నిండివుంది.

"ఓ అనామకుడికోసం నీ జీవితం సర్వస్వాన్నీ త్యాగం చేసేసి, ఓ అనాధకు తల్లివి కావడానికి సిద్ధమవుతున్నావు. ఎన్ని జన్మలెత్తితే నీ ఋణం తీర్చుకోగలను ప్రేమా...భగవత్సృష్టి ఎంత విచిత్రమైనది! క్రూరత్వం, దైవత్వం ఒకే... ఒకే...స్త్రీ మూర్తి లో..." కృతజ్ఞతాభావంతో గొంతు పూడుకుపోయిన సత్యానికి ఆపైనమాటలు పెగలలేదు.

ఆకాశమంత విశాలమైన ప్రేమకి-ఆ క్షణంలో సామాన్యమయిన అందరు ఆడపిల్లల్లాగ—

సుధాకర్‌తో అందమైన కలలాంటి వైవాహిక జీవితం కళ్ళముందు నిలిచి, వ్యామోహం కలిగించలేదు.

తనను ప్రాణప్రదంగా ప్రేమించిన తండ్రి తన నీడనుకూడా చూడడానికి అసహ్యించుకుంటాడని తెలిసి, దిగులు కలిగించలేదు.

రెండు జీవితాల్ని తీర్చిదిద్దడం కోసం తన ఒక్క చిన్ని జీవితాన్ని అర్పణ చేయగలుగుతున్నానన్న తృప్తి ఆమెకు కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చి ముందుకు పయనించేలా చేసింది.

* * *

అద్దాలు పైకెత్తి కిటికీలోంచి బయటికి తొంగిచూసింది ప్రేమ. వర్షం వెలిసినట్లుంది. చలిగాలి రివ్వున ముఖానికి కొడుతోంది.


తనభర్త సత్యం పల్లెటూళ్ళో ఉద్యోగం చేస్తున్నాడు. అందువల్లనే కూతురు శిల్పను పట్నంలో ఉంచి చదివించవల్సి వస్తోంది. చాలీచాలని జీతంతో జీవితాలు నెట్టుకొస్తున్నా, తనను ప్రేమతో తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నట్లు శిల్పకు తెలుసు. అందుకే ఆమె ఎంతో బుద్ధిగా చదువుకుంటుంది. దేనికీ నోరుజాచి అడగదు. సాదా నేత చీరల్లో నయినాసరే, భూమిమీదకి దిగివచ్చిన సౌందర్యాధిదేవత వీనస్‌లా—శిల్ప నిజంగానే శిల్పంలాగా అందంగా ఉంటుంది. చాలా రోజులకి, కూతుర్ని చూసిరమ్మని భార్యకు డబ్బిచ్చి పంపగలిగాడు సత్యం.

* * *

ఒక్క కుదుపుతో ట్రెయిన్ ఆగడంతో ఈ లోకంలోకి వచ్చింది ప్రేమ. స్టేషన్ వచ్చేసింది. బయటంతా కోలాహలంగా ఉంది. కంపార్టుమెంటులోంచి దిగేవాళ్ళహడావిడి రానురానూ ఎక్కువౌతోంది. వాతావరణం మారింది. బయట ఫెళ్లున ఎండకాస్తోంది. "ఎక్స్‌క్యూజ్ మి ఆంటీ, ఇఫ్ యు డోంట్ మైండ్, పైన సూట్‌కేస్‌ఉంది, కొంచెం తప్పుకుని దారిస్తారా?" తననిగుర్తించని సుధాకర్ చిరునవ్వుతో అభ్యర్థిస్తున్నాడు.

అకాలవృద్ధాప్యంవల్ల తను అమ్మమ్మలా మారినట్లు తనకే తెలుసు. అతను పాపం ఆంటీగా గౌరవించాడు. ప్రేమకు నవ్వొచ్చింది. చిరునవ్వుతో పక్కకు తొలగింది.

చేతిసంచీ పట్టుకొని గుమ్మంలోకివచ్చినిలుచుంది ప్రేమ, శిల్పకోసం స్టేషనంతా కళ్ళతోగాలిస్తూ. ఇంతలో బాణంలా ఆ కంపార్టుమెంటు దగ్గిరకి దూసుకొచ్చిందో అమ్మాయి.



"శిల్పా..." అప్రయత్నంగా ప్రేమనోటినుంచి వెలువడిన పిలుపుకి ఆ అమ్మాయి ఓసారి ప్రక్కకి తిరిగిచూసింది. ఆ అమ్మాయిని చూడగానే ప్రేమ నోట్లోని పిలుపు అక్కడే ఆగిపోయింది.

"డాడీ"... ఆత్మీయంగా సుధాకర్ భుజాల చుట్టూ చేతులువేసి, అతని సూట్ కేస్‌నందుకుంది ఆ అమ్మాయి. తర్వాత దూరంగాచూసి "మమ్మీ మమ్మీ,... ఇటురా! డాడీ ఇక్కడున్నారు" అని చప్పట్లు చరుస్తూ పిల్చింది. ఆ అమ్మాయి తల్లి పకపకగా అడుగులేసుకుంటూ అక్కడికి వచ్చింది దబ్బపండులాంటి పచ్చని శరీరచ్ఛాయతో, నీలం రంగు స్లీవ్‌లెస్ బౌజు, షిఫాన్ చీరెలో, రవ్వల నగలమధ్య మెరిసిపోతోంది ఆమె.

ఆమె అతనితో అంటోంది. "ఎందుకబ్బా ఇంతటీడియస్ జర్నీ? ఫ్లైట్‌లో రావచ్చుగా! పాపయితే అసలు స్టేషన్‌కి రానేరానని గొడవ చేసిందంటే తెల్సాముందు?" కూతురి జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి "నేనే బతిమాలి తీసుకొచ్చా ఈ బంగారు తల్లిని" అని ఆమెను దగ్గరికి తీసుకుంది.

"డ్రైవర్! ఆ సూట్ కేస్ తీసుకో, పదండి పోదాం.." అమె గాగుల్స్ తీసింది.

ఒక్కక్షణం నిశ్చేష్టురాలై చూసింది ప్రేమ ఆమెకేసి. తన కళ్ళను తానే నమ్మలేని స్థితి. ఆమె... రమ్య! రమ్య... సత్యాన్ని మోసం చేసిన రమ్య... సుధాకర్‌కు భార్య అయ్యింది.

ఎంత విచిత్రం! తను... ఆమెవల్ల తన జీవిత మార్గం మరోదారికి మళ్ళించుకుంది. ఆమె తాలూకు జీవితాన్ని తనకుతానై పంచుకుంది. ఛీ.. అదిసరే...! తనకు చెందవల్సిన అందమైన జీవితాన్నికూడా ఆమే దోచుకుందన్నమాట.. ఆమె స్థానంలోతనూ, తన స్థానంలో ఆమె... ఎంతవిచిత్రం!

"అమ్మా..." శిల్ప వచ్చి ఆత్రంగా భుజం మీద చెయ్యేసింది. ప్రేమ తేరుకుంది.

"నేను రాసిన ఉత్తరం అందిందా? నీ కోసమే వెతుకుతున్నాను. ఇంత ఆలస్య మయ్యిందే మమ్మా?"

శిల్ప తలొంచుకుంది. కాగితంలో పెట్టిన చెప్పులని సరిగ్గా చుడుతూ—

"దారిలో వస్తుంటే జోడు తెగిపోయింది. కుట్టించేందుకు వ్యవధిలేదు. ఈ ఎండ లసలు భూమ్మీద కాలు పెట్టేట్టు లేవుగా! వట్టి కాళ్ళతో గబగబా నడిచి రాలేకపోయాను"...నవ్వింది.

"అది సర్లే, అవునూ...నాన్న బాగున్నారా?" మాట మార్చింది. ప్రేమ కళ్ళల్లోకి చివ్వున నీరు చిమ్మింది.

ఇంతలో శిల్ప దృష్టి చటుక్కున ఎదురుగా ఉన్న ఆ అమ్మాయిమీద పడింది.

"అమ్మా...అటు చూడు, ఆ అమ్మాయిఅచ్చం నాలా లేదూ?... అరె!... విచిత్రం... పక్కన వాళ్ళమ్మ కాబోలు... నేను బాగా పెద్దయితే అచ్చం ఆమె లాగానే ఉంటానేమో కదూ..."

శిల్ప ఆశ్చర్యంనించి ఇంకా తేరుకోలేదు. వెనక్కి వెనక్కి తిరిగి వాళ్ళిద్దరికేసి చూస్తూనే ఉంది.

"శిల్పా...ఈ ప్రపంచంలో మనిషిని పోలిన మనుషులు అనేకమంది ఉంటారు. అందులో ఆశ్చర్యం లేదమ్మా... నాకు లాగ నీకు జోళ్లు లేకుండా నడిచే అలవాటు కూడా లేదు. అడుగులు త్వరత్వరగా వెయ్యి. లేకుంటే కాళ్లు కాలతాయి" ఆప్యాయంగా శిల్ప చేయి అందుకుని వడివడిగా ముందుకు తీసుకుపోయింది ప్రేమ. *



## మాటమీద

'అమ్మా! మనిషి నేలమీదగదే నిలబడేది?'

'అవునా ఏం?'

"మరి ఎదురింటి పిన్నిగారితో 'ముద్దిస్తానని ఇవ్వకుండా పోతావా. మనిషన్న తర్వాత మాటమీద నిలబడాలి'అన్నాడేనాన్నా!!" అడిగాడు చంటి తల్లిని.

ఆర్. డేవిడ్‌విల్సన్
కావలి

## ప్రయాణం

ఎన్నెలంతా మేసి ఏరు పొంగిందే!
ఆటు పోట్ల నడుమ నా నావ సాగింది!!
నీటి మీది అలలా...
జీవితపు కలలా...
కదలి కెరటాల కుదుపులతో
కుర్రకారు ఊసుల, బాసలతో
నా నావ సాగింది !!
నీటిపై నురగలా...
మీగడ తరగలా...
అలల కలల కవ్వింపులతో
గాలి జోల పాటలతో...
నా నావ సాగింది!!
దూరం పోవాలా..
తీరం చేరాలా...
దూరాన్నీ, భారాన్ని ఈదుకుంటూ
అలల తాకిడి తట్టుకుంటూ,
ఒంటరిగా, వేగంగా...
నా నావ సాగింది!!!

—తోపల్లి ఆనంద్
హైద్రాబాద్

## చిక్కు ప్రశ్న

అనుభవసారం
అగుపించని అగ్ని
'కాసారం
అక్షర మందిరం
ఆశల శర పంజరం
ఆశయాలు దాని
పారావారం
అమరత్వం దాని
ఆవలి తీరం
అది అర్థమయిందా
అంతరంగాన
శరజ్యోత్స్న
అర్థం కాకుంటే అదే
అంతు దొరకని
చిక్కు ప్రశ్న
అదేమిటో తెలుసా?
"కవి హృదయం!"

పైడి తెరేష్‌బాబు
ఒంగోలు


శ్రీ మహాలక్ష్మి వెరైటీ నవలలు!
ఆగష్టు 20 విడుదల!

కొత్త శత్రువు (మెడికల్ నావెల్)
మల్లాది వెంకటకృష్ణమూర్తి ....రు.15/-

సిగ్గు-సిగ్గు (సెంటిమెంటల్ నవల) ఆంధ్రభూమి సీరియల్
ఎన్.ఆర్. నంది ....రు.25/-

ఆటవికం (అడ్వెంచరస్ నవల) డైరెక్ట్ నవల
వసుంధర ....రు.15/-

సువర్ణరేఖ (ప్రేమనవల) ఆంధ్రజ్యోతి సీరియల్
భమిడిపాటి రామగోపాలం ....రు.12-50

సాగరలోయ (అడ్వెంచరస్ నవల) అపరాధపరిశోధన సీరియల్
బొమ్మిడి అచ్చారావు ....రు.17/-

అడ్వాన్సుతోపాటు ఆర్డర్లు పంపించండి!

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
గవర్నరుపేట, విజయవాడ-520 002 ఫోన్:63322